ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): ఫస్ట్ రాండమైజేషన్‌లో భాగంగా జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పరిశీలించారు. సర్దాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ఈవీఎం గోదాము నుంచి సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లను తరలించారు. తరలింపు ప్రక్రియకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరుకాగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గానికి 358 కంట్రోల్ యూనిట్లు, 358 బ్యాలెట్స్ యూనిట్స్, 401వీవీ ప్యాట్లు, వేములవాడ నియోజకవర్గానికి 325కంట్రోల్ యూనిట్స్, 325 బ్యాలెట్ యూనిట్స్, 364వీవీ ప్యాట్స్ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, అధికారులు ఉన్నారు.

ఈజీఎస్ కూలీలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

- డీఆర్డీవో శేషాద్రి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్19: ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి సూచించారు. తంగళ్లపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కల్పించాలని, పని ప్రదేశంలో అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం వంద రోజులు పని చేసే విధంగా సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రోగ్రాం అధికారి నర్సింహులు, ఈజీఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎంపీడీవో జోగం రాజు, అదనపు ప్రోగ్రాం అధికారి, జూనియర్ రాజనర్సయ్య, సాంకేతిక సహాయకులు లక్ష్మణ్, మనోహర్, దేవి, సుష్మ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- ఉరుములు, మెరుపులతో పలు గ్రామాల్లో అకాల వర్షం
- నేలవాలిన వరి, మామిడికాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- జంగంరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు ఆవు మృతి

రుద్రంగి: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

వీర్నపల్లి/ఇల్లంతకుంట/రుద్రంగి, ఏప్రిల్ 19: జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వానతో వరి, మామిడికాయలు నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు తడిపోయాయి. ఈ క్రమంలో వీర్నపల్లి మండలం లాలసింగ్‌తండాలో లోక్‌నాయక్ ఇంటి రేకులు ఈదురుగాలులకుఎగిరిపోగా, రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అదే గ్రామంలో గడ్డివాము, కరెంట్ వైరు రోడ్డుపై పడడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. రెవెన్యూ, విద్యుత్ సిబ్బంది వాటిని తొలగించారు. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం 600 క్వింటాళ్ల ధాన్యం తడువగా, తూకం వేయని 7800 క్వింటాళ్ల ధాన్యం తడిసినట్లు ఏపీఎం నర్సయ్య తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. ఈ క్రమంలో జంగంరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు పారిపెల్లి చిన్న రాజిరెడ్డికి చెందిన ఆవు మృతి చెందింది. ఆవు మృతితో ₹లక్ష వరకు నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

సెంటర్లలో తడిసిన ధాన్యం

రుద్రంగిలోని మార్కెట్ యార్డు, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. మ్యాశ్చర్ వచ్చినప్పటికీ వడ్లు కొంటలేరని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

కోనరావుపేట: మండల కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

ఇల్లంతకుంట: జంగంరెడ్డిపల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న గ్రామస్తులు

సలహాలు, ఫిర్యాదులుంటే వెంటనే సంప్రదించండి

కలెక్టరేట్, ఏప్రిల్ 19: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ ఫిర్యాదులు సూచనలు, సలహాలుంటే ఎన్నికల వ్యయ పరిశీలకులను సంప్రదించవచ్చని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకుడు అశ్విన్‌కుమార్ పాండ్యా (9032659531)కు వ్యయం సంబంధిత ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పరిశీలకులు జిల్లాలోనే ఉండి ఎన్నికల వ్యయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తారని తెలిపారు.

ఐడీటీఆర్‌లో యోగా శిక్షణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ఐడీటీఆర్‌లో యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. డ్రైవింగ్‌లో శిక్షణ పొందుతున్న వారికి ఐదు రోజులపాటు యోగా గూరూజీ ఉప్పుల శ్రీనివాస్ శిక్షణ అందించారు. నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, దినచర్యలో యోగా సాధన భాగం చేసుకోవాలని సూచించారు.

తాటి, ఈత చెట్లు దగ్ధం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం తాడూరులో నిప్పంటుకుని తాటి, ఈత చెట్లు దగ్ధమయ్యాయి. శుక్రవారం తాటి వనంలో మంటలు అంటుకున్నట్లు సమాచారం రావడంతో అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే వచ్చి మంటలను అర్పివేశారు. సుమారు 300చెట్లు దగ్ధమైనట్లు గౌడ సంఘం నేతలు తెలిపారు. కాగా, దగ్ధమైన తాటివనాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధైర్యపడొద్దు.. ఆదుకుంటామని గీత కార్మికులు భరోసానిచ్చారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- అధికారులతో సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 19: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర విచారణ మరింత సమర్థవంతంగా అన్నిస్థాయిల్లో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ముందుకుసాగాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలన్నారు. పటిష్టమైన ప్రణాళికలతో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించే కార్యచరణ అమలు చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు భద్రత భావాన్ని కలిగించాలని సూచించారు. ఇక్కడ ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రాచారి, మురళీకృష్ణ, సర్వర్, సీఐలు, ఎస్ఐలు, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

దేశాన్ని రక్షించుకుందాం

వేములవాడ, ఏప్రిల్ 19: మోదీ నిరంకుశ పాలనకు పార్లమెంట్ ఎన్నికల్లో చరమగీతం పాడి దేశాన్ని రక్షించుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో మే డేకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మే డే వేడుకలను ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

టిప్పర్ సీజ్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 19: వేములవాడ మండలం అనుపురం శివారులోని మిడ్‌మానేరులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు టిప్పర్ సీజ్ చేశామని తహసీల్దార్ చెప్పారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ పరిశీలన

కలెక్టరేట్, ఏప్రిల్ 19: కలెక్టరేట్ సముదాయంలోని బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ను అర్ధ గణాంక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, డీవైఎస్‌వో శ్యాంసుందర్ పరిశీలించారు. ఈ క్రమంలో అధికారులు శుక్రవారం వెదర్ స్టేషన్‌ను జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. యంత్రం పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వర్షపాతం వివరాలు ఎలా నమోదు అవుతున్నాయో సందర్శించారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 21ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఉన్నాయని, ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. అలాగే సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాలలో వరి పంట కోత ప్రయోగం నిర్వహించగా డీవైఎస్‌వోలు శ్యాంసుందర్, గణేశ్, సీపీవో శ్రీనివాసచారితో కలిసి పరిశీలించారు. పంట కోత దిగుబడిపై జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 19: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిలిండర్ లీకేజి అయి మంటలు వచ్చినప్పుడు, ఆయిల్ వంటి లిక్విడ్ ఫైర్ జరిగినప్పుడు, ఇండ్లు, గిడ్డంగులు అగ్ని ప్రమాదాలకు గురైనప్పుడు వాటిని ఆర్పివేసే విధానం, వడదెబ్బ తగిలి స్పృహతప్పి పడిపోయినప్పుడు, ప్రమాదాలకు గురైనప్పుడు వారిని సురక్షిత ప్రదేశాలకు తీసుకెళ్లి, ప్రథమ చికిత్స చేయించే విధాంపై అవగాహన కల్పించారు. ఇక్కడ పాఠశాల ప్రధానాచార్యులు చిలుక గట్టు, ఎస్ఎఫ్‌వో పీ కమలాకర్, బీ రాజేంద్రప్రసాద్, జీ యాదయ్య, ఫైర్‌మెన్ శంకర్, రాజేశం, తదితరులు ఉన్నారు.

ఒకరి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల మల్లయ్య(48) ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. అందు కోసం అప్పు చేయగా, తీర్చేదారి లేకపోవడంతో గురువారం రాత్రి ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

సేవాభావం కలిగిఉండాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగిఉండాలని మండల వ్యవసాయాధికారి సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దలింగాపూర్‌లో బాబూ జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులు జాతీయా సేవా పథకం ప్రత్యేక శిబిరం ప్రారంభోత్సవాన్ని రైతు వేదికలో నిర్వహించారు. గ్రామంలో ఏడు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, కరీంనగర్ డీఏటీటీసీ కోఆర్డినేటర్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అరుణ్‌బాబు, భవ్యశ్రీ, తదితరులు ఉన్నారు.

'పల్లె ప్రగతి' యాప్ పర్యవేక్షణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లిలో శుక్రవారం డీపీవో వీర బుచ్చయ్య పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె ప్రగతి యాప్‌ను పరిశీలించారు. నర్సరీ, చెత్త శుద్ధీకరణ కేంద్రంలో ఉన్న గ్యాప్స్ మూడు రోజుల్లో సరి చేసుకోవాలని ఆదేశించారు. మంచి నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ఓవర్ హెడ్ టాంక్స్ పరిశీలించారు. ఇంటింటికీ వంద శాతం నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జోగం రాజు, ఈజీఎస్ సిబ్బంది, కార్యదర్శి ఉన్నారు.

వడ్లు ఇంకెప్పుడు కొంటరు?

- కాంగ్రెస్ సర్కారుపై సీపీఐ నేతల ఫైర్
- జిల్లెల్లలో కొనుగోలు కేంద్రం సందర్శన

జిల్లెల్లలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వేణు, నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్19: వరి కోతలు ప్రారంభమై నెలకావస్తున్నా.. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు ఇంకెప్పుడు కొంటారని కాంగ్రెస్ సర్కారుపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని కొనుగోలు కేంద్రాన్ని హమాలీ సంఘ జిల్లా నాయకుడు పంతం రవితో కలిసి సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, నాయకులు శుక్రవారంసందర్శించారు. హమాలీ కార్మికులు, రైతులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వెంటనే ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటిస్తున్నా.. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రైతులు ఆందోళనలో ఉన్నారని, ధాన్యం రక్షించుకోవడానికి టార్పాలిన్ పంపిణీ చేయాలన్నారు. హమాలీ కార్మికులు, రైతులకు కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించాలన్నారు. కటింగ్‌ల పేరిటి చేసే దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సోమ నాగరాజు, బచ్చపల్లి శంకర్, శ్రీను, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 19: సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల ఉంచి ద్విచక్ర వాహనాలు దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ రఘుపతి పేర్కొన్నారు. ఈ నెల 10న దామని బార్ వద్ద, సినారె గ్రంథాలయం వద్ద రెండు వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టగా, శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ జంక్షన్ వద్ద వెంకంపేటకు చెందిన నిందితుడు కొల రవి వద్ద నుంచి రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు రవిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఓటు హక్కు నా బాధ్యత.. అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

- జడ్పీసీఈవో ఉమారాణి
- స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన

కలెక్టరేట్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జడ్పీసీఈవో ఉమారాణి పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సమాఖ్యలో స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. 'ఓటు హక్కు నా బాధ్యత' (ఐ ఓట్ ఫర్ ష్యూర్) అంటూ నినదించి, ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ డీఆర్డీవో శేషాద్రి, స్వీప్ నోడల్ అధికారి, అదనపు డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య బాధ్యులు, సభ్యులు, తదితరులు ఉన్నారు.

ముచ్చర్ల ఆరోగ్య ఉప కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి

మెరుగైన సేవలందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేట, ఏప్రిల్ 19: ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సముద్రలింగాపూర్, ముచ్చర్ల ఆరోగ్య ఉప కేంద్రాలను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, దీర్ఘకాలిక పరీక్షల నిర్ధారణ, చిన్నారులకు టీకాలు, ఓపీ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, తదితర వాటిపై కలెక్టర్ ఆరా తీశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు, సాధారణ కాన్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఉప వైద్యాధికారి రజిత, ప్రోగ్రాం అధికారి ఉమాదేవి, మెడికల్ అధికారి వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో వినోద్

భక్తులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్ దంపతులు

బోయినపల్లి, ఏప్రిల్ 19: మూన్వాడలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్-డాక్టర్ మాధవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొండయ్య, ఎంపీటీసీ గీతారెడ్డి, నర్సింగపూర్ ఎంపీటీసీ ఆగయ్య, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో చేర్పించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: సంచార జీవితాలు గడుపుతున్న కుటుంబాలు వారి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సంక్షేమ సమితి చైర్మన్ కమటం అంజయ్య, సభ్యుడు డాక్టర్ పున్నం చందర్ సూచించారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో సంచార కుటుంబాలకు జిల్లా బాలసంక్షేమ సమితి బాలరక్షక భవన్ ఆధ్వరంలో కౌన్సెలింగ్ నిర్వ హించారు. వీధి బాలల సంక్షేమంపై చైల్డ్ బెగ్గింగ్, బెగ్గింగ్ మదర్స్‌పై వివరించారు. సొసైటీలో పిల్లల్ని ఎత్తుకుని, లేక పిల్లలతో భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలందరినీ పాఠశాలకు పంపాలని, బాల రక్షాభవన్ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వారికి వివరించాలని సూచించారు. ఇక్కడ చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ ఉన్నారు.

₹5.67లక్షలు సీజ్

వేములవాడ, ఏప్రిల్ 19: ఎలాంటి ఆధారాలు లేకుండా భారీగా తరలిస్తునన నగదును ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సీజ్ చేశారు. అధికారి వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పట్టణంలో వాహనాల తనిఖీ చేపట్టగా, నంద్యాడపు నర్సయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న ఐదు లక్షల 67వేల రూపాయల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరూ కూడా ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తీసుకెళ్లవద్దన్నారు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి,హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఉన్నారు.

బాల్య మిత్రుడికి బాసట

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: బాల్య మిత్రుడికి చిన్ననాటి మిత్రులు (1988-89 లో ఎస్సెస్సీ బ్యాచ్) ఆర్థిక సాయం చేసి బాసటగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపూర్‌కు చెందిన పంతంగి శ్రీనివాస్ కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 25న అతడి కూతురు స్నిగ్ధ వివాహం నిశ్చయం కావడంతో వారి వంతుగా రూ.50 వేలు అందించారు.

వస్త్ర పరిశ్రమకు ₹ 50కోట్లు విడుదల

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం రూ.50కోట్లు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.290కోట్లలో రూ.50కోట్లు టెస్కో సంస్థకు విడుదల చేసినట్లు వస్త్ర వ్యాపారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన బకాయిలు దశల వారీగా ఇస్తానని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

సమన్వయంతో పనిచేయాలి

సందీప్‌కు శాలువా కప్పి అభినందిస్తున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: ప్రతి కార్యకర్తతో సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట పట్టణాధ్యక్షుడిగా ఎడ్ల సందీప్‌ను మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరితో కలిసి నియమించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ పార్లమెంట్ అభ్యర్థిగా వినోద్‌కుమార్ గెలిపించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి కిషన్, పందిళ్ల పరశురాములు, మీసం రాజం, బందారపు బాలరెడ్డి, దొనుకుల కళ్యాణ్, నర్సింహులు, శివ, బాలయ్య, బాబు, దూస శ్రీనివాస్ ఉన్నారు.

బస్వాపూర్‌లో మద్యం పట్టివేత

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ముస్తఫా తెలిపారు. శుక్రవారం గ్రామంలో దాడులు చేయగా, రూ.11వేల విలువైన మద్యం లభ్యమైందని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.